# కవితా కౌముది

## నే..

ఎస్.ఆర్.బందా

నేను
విరసంలోంచీ విగతంలోంచీ పుట్టను
పరిహాసంలోంచీ పరిక్రమల్లోంచీ ఎదగను
ఆహ్లాదాల్లోంచిగానీ అసాధారణాల్లోంచిగానీ మసలను

నేను
కొరతల్లోంచి కొత్తదనాల్లోంచి
కొన్ని కొన్ని కన్నీళ్లలోంచి
ఆక్రందనల్లోంచీ ఆశుకవితల్లోంచీ
పుట్టే అవకాశాన్నందుకోను

నేను
విరుపు నవ్వుల్లోంచి విరిగిన నొసళ్లలోంచి
వెర్రి విరహాల్లోంచి కర్రి కామాల్లోంచి
భ్రమల బాదుళ్లలోంచి విమల విద్వత్తుల్లోంచి
అపుడపుడూ తలెత్తుతుంటాను

నేను
వొత్తుకుపోయిన పుప్పొడుల్లోంచి
ఎండిపోయిన రంగుల్లోంచి ఎదని తాకిన తీగల్లోంచి
ఏడుపునాపే కౌగిళ్లలోంచి ఎదురుచూసే స్వప్నాల్లోంచి
అందని అంబరాల్లోంచి అందుకున్న ఎడారుల్లోంచి
కవ్వించే గుర్తుల్లోంచి నవ్వించే - ఆవిడ మాటల్లోంచి

కూస్తుంటాను కొన్నిసార్లు కోస్తుంటాను మరిన్నిసార్లు
కోసుకుంటుంటాను చాలాసార్లు కొత్తకొత్తగా
పులుపు రుచులు చూస్తుంటానెన్నోసార్లు

అంతర్దృష్టితో వీక్షిస్తూ
అంతర్మనంతో ఆకాంక్షిస్తూ
అంతర్మథనంతో అడుగు ముందుకేస్తూ.. నేను నేనే.. నాలో నేనే... ★★★

## తాను నేను
## శిరీష

తాను నేను నిరంతరం
వినిపించే ప్రణవ సంగీత రాగాలం...

తాను వీచే గాలి
నేను మోగే మృదంగం ...

తాను శూన్యం
నేను నిశ్శబ్దం ...

తాను వేగంగా పరిగిడే కాలం
నేను స్తబ్దించే నిరీక్షణాన్ని....

తాను శ్వాసించే వాస్తవం...
నేను స్వప్నంలో ఉగిసలాడే ఊహ...

తాను అలిసిపోని ప్రశాంతతా..
నేను ఆలోచనలా అల్లాకల్లోలాన్ని...

తాను.. అనంతమైన ఆనంద సాగరం..
పంచె కొద్దీ పెరిగే ప్రేమత్వం..

నేను ... క్షణాల తరాజులులో ఆర్ద్రత ను
కొలిచే కొలమానాన్ని...

తాను ...నవ్వుల తేనె నది...
నేను అలకల కట్టమిట్టని......

తాను నేను విరుద్ధాన్ని దర్శింపజేసే
వీడని దగ్గరితనాలం...

★★★

## ఆలి
## నాగ్రాజ్

ఆమె కళ్ళు గుమ్మానికి వేలాడదీస్తుంది
కొప్పునిండా మల్లెల ఆశలు తురుముకుని!

గాలి ఊసులుచెబుతుంటే ఊ కొడుతుంది
మనసునిండా అతని యాది నింపుకుని!

గడపను దిండుచేసి కంటిని జోకొడుతుంది
ఇంటినంతా వెన్నెలను గస్తీపెట్టి!

ఎవరో వచ్చి చెప్పినట్టే టక్కున లేస్తుంది
కంటిదీపాల కాగడాపట్టి అతన్ని ఆహ్వానిస్తూ!

★★★

## నిశ్చింత
## వాసుదేవమూర్తి శ్రీపతి

మృత్యువు - చేరాల్సిన తుది గమ్యం
కాలం - ప్రయాణ సాధనం
మజిలీలు బంధాలు, అనుబంధాలు,
ఆశలు, ఆశయాలు
కీర్తి మరణంతో ఆగని ప్రయాణం
కీర్తిబరువు – మనం మరణించాక
కారే కన్నీటి బరువుతో సమానం!
అలసిపోయి చాలాసేపైంది
ఇంక మృత్యువుని కప్పుకుని నిద్ర పోవాలి!
హమ్మయ్య నన్ను మోసే
నలుగురినీ సంపాదించుకున్నాను
ఇంక నిశ్చింతగా చచ్చిపోవాలి!

★★★

# ముద్దుబిడ్డ

భాగ్యలక్ష్మి అప్పికొండ

చీకటి చిక్కబడి
వెన్నెల వెచ్చబడి
తనువు నీ తపనలతో తల్లడిల్లిపోతుంది..
తల్లి చాటు బిడ్డవు కదూ!
ఆలి నీకలుసు..
ఎక్కడో అమ్మ ఎదపై తుపాకీతో పహారా ఆట ఆడతావు
నీ నేస్తాలతో కూడి గస్తీ కాస్తావు...
దట్టమైన అడవిలో
గడ్డకట్టే చలిలో
నడిసంద్రంలో
వినీలాకాశంలో
చుట్టూ తిరుగుతావ్ అమ్మ కొంగు వదలక...
అనుక్షణం అప్రమత్తంగా పోరాడతావ్
రొమ్మెత్తి ఎదురు నిలుస్తావు
నేను గుర్తున్నానా? అని అడిగితే..!
నిన్ను ప్రేమిస్తున్నాను,
నీతోనే ఉంటాను
అని అబద్ధం ఆడమంటావా? అంటూ
చుక్కలతో చమత్కరిస్తావు...
ఎంత అశో!
అమ్మ చేత ముద్దుబిడ్డ అనిపించుకుందామని..
మరి నేనేంగాను..?
చీకటి చిక్కబడి
వెన్నెల చల్లబడి
నా ఊపిరి ఉలికి పాటుల సవ్వడిలో
నీ ముద్దు బిడ్డ ఎదపై జోగుతోంది...

నీ తలపులతో
సగం గుండె బరువెక్కిపోతుంది..
ఎంత హుషారో
ఏమంత పట్టుదలో
ఎందుకంత కార్యదక్షతో
నాలో నింపిన నీ మొండిధైర్యం
ప్రపంచంతో పనిలేదన్నట్టు
పాదాల్ని పరిగెట్టిస్తోంది..
నిలువని మేఘంలా వస్తావు..
నా తల్లి సపర్యలకి వీరుణ్ణియమని మురిపిస్తావ్
మైమరిపిస్తావు..
ఎంత స్వార్థం? అంటే బుగ్గని గిల్లి,
అమ్మ పిలిచిందంటూ
రణధీరుడవై యుద్ధరంగానికి కదం తొక్కుతావ్..
చీకటి చిక్కబడి
వెన్నెల రుధిరజ్వాలు చిమ్ముతోంది..
నా తనువు మనసు కఠినమై, జఠిలమై
కనుపాప చేరని గుండె తడి
సందిగ్ధ, సంకట, ప్రశ్న రూపు దాల్చినది
ఇప్పుడు నేనేమని వేడాలి..?
నా ప్రాణమా! సౌభాగ్యమా!
నే వేడుకుంటున్నా
అమ్మ నుదుట నిలువు రక్త సింధూరమై
భరతమాత సౌభాగ్యమై!!

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

నభమునుండి యేతెంచునీ శుభమరీచి
భువనమంతయు నిండి సంపూర్ణమయ్యె
వేవెలుంగుల రాయని వెలుగు కాదు
కౌముదీపతి వెన్నెల కాంతి కాదు

ఇది హృదయమెల్ల నిండు సంతృప్త దీప్తి
ఇరుల పోద్రోలి జ్ఞానమ్మునిచ్చు జ్యోతి
చక్షువులు కనలేని యస్పష్టరేఖ
వచ్చి మనసును తాకు విస్పష్టకాంతి

ఇది మహానందసామ్రాజ్యమిది మనస్సు
నంత పరితోషమున ముంచునమృతధార
ఇచటి మనుగడే మనల యదృష్టమింక
చిత్తమున స్వార్థయోచనల్ చింతలేల

కన్నులరయుచునుండునాకసము వైపు
చరణములు రావవెన్నడు ధరణి దాటి
అద్భుతమ్మైనదీ లోకమమృతమయము
ప్రేమబంధమెదనెపుడు విడచిపోదు

ప్రేమ పంచగ మలినమ్ము వీడు మనసు
స్వార్థమును వీడు హృదయమ్ము స్వచ్ఛమౌను
గగననదమున మనసు మున్కలను వేయు
అమృతమయజీవితమ్మన్న యర్థమగును



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS